సాక్షి ఆదిలాబాద్

బుధవారం : 3 : మే : 2023



వీడిన జంటహత్యల మిస్టరీ

గుడిహత్నూర్ మండలంలో గతనెల 30న జరిగిన జంట హత్యల కేసు మిస్టరీ వీడింది. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం వివరాలు వెల్లడించారు.

8లో▸



చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రస్తుతం అందరిలో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ఫిట్‌నెస్ కోసం చిరుధాన్యాలకు ప్రాధాన్యమిస్తున్నారు. వైద్యనిపుణులు సైతం సూచిస్తుండడంతో మొగ్గు చూపుతున్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

8న ఐటీఐ అప్రెంటిషిప్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ఈనెల 8న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. www. apprentieshindia. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న హార్డ్ కాపీతో పాటు ఆధార్ కార్డు, పదోతరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్, రెండు పాస్ ఫొటోలను కళాశాలలో అందజేయాలని పేర్కొన్నారు. వివిధ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. శిక్షణ కాలంలో స్టైఫండ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం కళాశాలలో శిక్షణ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్

ఆదిలాబాద్: విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో డీఎస్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాకీ క్రీడా శిక్షణ శిబిరాన్ని డీవైఎస్‌వో వెంకటేశ్వర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిభగల క్రీడాకారులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లాలో 16 శిక్షణ శిబిరాలను ప్రారంభిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, సీనియర్ అసిస్టెంట్ ఇక్బాల్, శిక్షకులు అతుల్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల రక్షణకు చర్యలు



గోదాంలోని పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు గోదాముల్లో నిల్వ ఉంచిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు సంబంధించి రక్షణ చర్యలు చేపడుతున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు. ఆయా గోదాములను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. జిల్లాకు 6,51,580 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటివరకు 2,76,185 పుస్తకాలు వచ్చాయని తెలిపారు. మిగతావి త్వరలోనే రానున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలను మండల కేంద్రాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు. ఆమె వెంట విద్యాశాఖ ఏడీ నర్సింలు, సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్, పాఠ్య పుస్తకాల మేనేజర్ సత్యనారాయణ, రాజేశ్వర్ తదితరులున్నారు.

'ఎర్లీబర్డ్'కు స్పందన

- బల్దియాకు రూ.1.86 కోట్ల ఆదాయం
- ముగిసిన ముందస్తు పన్ను చెల్లింపు గడువు

కైలాస్‌నగర్: ముందస్తు ఆస్తిపన్ను వసూళ్ల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ స్కీంకు ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో అనూహ్య స్పందన లభించింది. ఈగడువు గత నెల 30తో ముగియగా భారీగా ఆదాయం సమకూరింది. పలువురు వ్యాపారులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్నులు చెల్లించారు. ఫలితంగా వారికి ఐదు శాతం రాయితీ లభించగా మున్సిపల్‌కు ఆదాయం సమకూరినట్లయింది.

రూ.1.86కోట్ల ఆదాయం

మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలు పడకుండా ఉండటంతో పాటు ఆదాయం సమకూర్చుకునేలా ప్రభుత్వం ముందస్తు పన్ను వసూళ్ల కోసం ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ప్రకటించింది. ఇందు కోసం గత నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పన్ను చెల్లింపునకు అవకాశం కల్పించింది. ఈమేరకు ఆదిలాబాద్ మున్సిపల్‌లో అనూహ్య స్పందన లభించింది. మొత్తం 5259 మంది స్వచ్ఛందంగా ఆస్తి పన్ను చెల్లించారు. తద్వారా బల్దియాకు రూ.1.86 కోట్ల ఆదాయం సమకూరింది.



మూడు కిలోమీటర్ల నుంచి ఇలా కాలినడకన బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న ఆదివాసీలు



బావి వద్ద గ్రామస్తుల సందడి

సుంగాపూర్‌లో నీటి గోస

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గుక్కెడు నీటి కోసం ఆదివాసీల అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. మండలంలోని సుంగాపూర్ గొందుగూడలో దాదాపు 100పైగా ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వీరంతా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామం నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి ఓ బావి నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ఇక్కడ పని చేయడం లేదని పేర్కొంటున్నారు. సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి తాగునీటి ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు. – నార్నూర్



ఇచ్చోడ గ్రామసభలో పోడు భూములకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాల పరిశీలన (ఫైల్)

పోడుకు పట్టం

- ఫైల్‌పై సీఎం సంతకం
- ఈ నెల నుంచే పట్టాల పంపిణీ
- ఇప్పటికే హక్కుపత్రాలు సిద్ధం
- ఎంపికైన లబ్ధిదారుల్లో హర్షం

పోడు దరఖాస్తుల వివరాలు..

జిల్లా	గిరిజనుల దరఖాస్తులు	విస్తీర్ణం (ఎకరాల్లో)	గిరిజనేతరుల దరఖాస్తులు	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఆదిలాబాద్	11,172	44,120	7,712	28,472
మంచిర్యాల	4,460	13,587	7,314	19,830
నిర్మల్	5,076	14,955	3,590	10,037
కుమురంభీం	13,177	51,859	13,503	44,267
మొత్తం	33,885	1,24,521	32,119	1,02,606

సాక్షి,ఆదిలాబాద్: పోడు పట్టాల పంపిణీ కార్యరూపం దాల్చేదిశగా అడుగులు పడ్డాయి. కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఈ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ నెల నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేపడతామని చెప్పారు. ఈ మేరకు ఎంపికైన లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతుంది. అటవీ హక్కు పత్రాలు వస్తే తమకు ప్రయోజనం చేకూరుతుందని ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా భావిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు ఇప్పటికే హక్కు పత్రాలు సిద్ధమైనట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం వెలువడిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డిని వివరణ కోసం 'సాక్షి' ఫోన్‌లో యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి రాజశేఖర్‌ను వివరణ కోరగా.. పూర్తిగా గిరిజన సంక్షేమ శాఖనే పరిశీలన చేస్తుందని, తమ పరిధిలో వివరాలు ఉండవని పేర్కొన్నారు.

ఇదీ పరిస్థితి..

గతేడాది ఆర్‌వోఎఫ్‌ఆర్ టైటిల్ డీడ్స్ కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. గ్రామ స్థాయిలో వీటిని స్వీకరించింది. అప్పట్లోనే ప్రక్రియ పూర్తి చేస్తామని సర్కారు ప్రకటించింది. క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించింది. అటవీ శాఖ నుంచి బీట్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు ఆ దరఖాస్తుదారుల్లో అర్హులు, అనర్హులపై పరిశీలన చేశారు. అనంతరం కార్యదర్శులు ఆన్‌లైన్ యాప్‌లో వాటి వివరాలు నమోదు చేశారు. గ్రామసభలు నిర్వహించి అర్హుల విషయంలోనూ ఆరా తీశారు. ఆ తర్వాత ఆర్డీవో స్థాయిలో సబ్ డివిజనల్ కమిటీ పరిశీలనకు ఆ దరఖాస్తులను పంపారు. ఆ ప్రక్రియ జరుగుతున్న క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ అధికారి శ్రీనివాస్‌రావు హత్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఇక పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తారనుకున్న దశలో మళ్లీ నిలిచిపోయింది. అయితే జిల్లాలో అప్పటికే సబ్ డివిజనల్ కమిటీ పరిశీలనతో పాటు జిల్లా స్థాయి కమిటీకి నివేదించడం సైతం పూర్తయింది. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన నేపథ్యంలో ఇక జిల్లా స్థాయిలో ఆమోదం నామమాత్రమే. ఆపై రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించి పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తారు.

గిరిజనులు, గిరిజనేతరులు కూడా..

పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారిలో గిరిజనులకు సంబంధించి 2005 డిసెంబర్ 13కు ముందు నుంచి సాగులో ఉండి దానిపైనే జీవనాధారంగా ఉంటే వారికి హక్కు పత్రాలు కల్పించనున్నారు. అలాగే గిరిజనేతరులకు సంబంధించి మూడు తరాలకు ముందు నుంచి ఈ లెక్కన సుమారు 75 ఏళ్ల నుంచి ఆ భూమిపై సాగులో ఉంటే వారికి హక్కు పత్రం కల్పించే నిబంధనలున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉండే గిరిజనులు, గిరిజనేతరులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టాన్ని తీసుకొచ్చింది. గిరిజన సంక్షేమ శాఖ దీనికి నోడల్ శాఖగా ఉంటుంది. ప్రధానంగా ఏజెన్సీలో నివాసం ఉండే గిరిజనులు, గిరిజనేతరుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

2006 నుంచి ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం అమలులోకి వచ్చింది. 2008లో ప్రారంభమైంది. 2019 వరకు ఆర్‌వోఎఫ్‌ఆర్ టైటిల్ డీడ్స్ ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత నిలిపివేశారు. అప్పటివరకు 56,358 మంది 2,25,569 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి జిల్లాలో అటవీ హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 37,372 మందికి చెందిన దరఖాస్తులు 1,35,997 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి సంబంధించి అర్హులని గుర్తించారు. 36,713 మందికి 1,37,734 ఎకరాల విస్తీర్ణంలో పట్టాలు పంపిణీ చేశారు. మరో 515 దరఖాస్తులకు సంబంధించి 1,399 ఎకరాల విస్తీర్ణంలో పట్టాల పంపిణీకి సంబంధించి పెండింగ్‌లో ఉంది. ఇదంతా 2019కు ముందు. ఇక ఆ తర్వాత అటవీ హక్కు పత్రాల కోసం పోరాటాలు కొనసాగిన నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి సర్వేకు ఆదేశించి దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం ఈ దరఖాస్తులకు సంబంధించి టైటిల్ డీడ్స్ ఎంత మందికి ఇస్తారనేది త్వరలోనే స్పష్టం కానుంది.

ఐదో రోజుకు జేపీఎస్‌ల సమ్మె



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె ఐదో రోజుకు చేరింది. ఈమేరకు జేపీఎస్‌లు మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. సమ్మె శిబిరం నుంచి బస్టాండ్ వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ కొనసాగించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్రమబద్ధీకరణపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు సమ్మెను ఆపేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, జేపీఎస్‌లు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రం రాక.. నిలిచిన 'ఓపెన్' పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: ప్రశ్నపత్రం రాక ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్ష నిలిచిపోయిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. మంగళవారం ఎకనామిక్స్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగే పరీక్ష కోసం విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల పాఠశాల, బాలక్ మందిర్‌తో పాటు ఉట్నూర్‌లోని ప్రభుత్వ బాలుర ఆశ్రమపాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు ఉదయం 8.45 గంటలకు ప్రశ్న పత్రాల బండిల్స్ తెరవగా అందులో ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రాలు మాత్రమే ఉన్నాయి. నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. మూడు కేంద్రాల్లో ఇలాగే జరగడంతో అవాక్కయ్యారు. విషయాన్ని ఓపెన్‌స్కూల్ జిల్లాకోఆర్డినేటర్ అశోక్ దృష్టికి తీసుకెళ్లారు.ఆయన డీఈవో ప్రణిత, పరీక్షల అబ్జర్వర్ రాజీవ్, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరికి విషయాన్ని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని వారు పేర్కొన్నారు. దీంతో పరీక్ష రాయకుండానే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఈనెల 13న ఈ పరీక్ష నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఎకనామిక్స్ ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులు మాత్రం యథావిధిగా పరీక్ష రాశారు.

బాధిత రైతులను ఆదుకుంటాం



నందిగామలో దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- త్వరలోనే పరిహారం అందేలా చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- నందిగామలో దెబ్బతిన్న పంటల పరిశీలన

తలమడుగు: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తలమడుగు మండలం నందిగామ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బ తిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అకాల వర్షాల కారణంగా సుమారు 2,800 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు తెలుస్తుందన్నారు. రెండు రోజుల్లో సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పంటల వారీగా నష్టంతో పాటు బాధిత రైతుల వివరాలను సేకరించాలని వ్యవసా య అధికారులను ఆదేశించారు. నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కౌలు రైతులకు కూడా పరిహారం అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, స్థానిక జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ కల్యాణ లక్ష్మీరాజేశ్వర్, తహసీల్దార్ వనజారెడ్డి, సర్పంచ్ భగీరథ బాయి, ఆత్మ డైరెక్టర్ శాస్త్రి, రైతులు తదితరులున్నారు.

పనులు వెంటనే ప్రారంభించాలి

కైలాస్‌నగర్: పట్టణంలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టే పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో తన చాంబర్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పట్టణంలో రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.97.2 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. స్థానిక తాంసి బస్టాండ్ వద్ద నిర్మించనున్న అండర్ బ్రిడ్జి, ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో నిర్మించనున్న ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. భూసేకరణ, ఫుట్‌పాత్ పనులు చేపట్టేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సమీకృత కలెక్టరేట్ భవననిర్మాణానికి సంబంధించి రూ.55 కోట్ల పాలన అనుమతులు మంజూరయ్యాయన్నారు. పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కేఆర్‌కే కాలనీ, మావల సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు కేటాయించనున్నందున మిగిలి ఉన్న పనులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్, ఎస్.నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, ఆర్డీవో రమేశ్ రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన అవినీతిమయం



మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

- బీజేపీయే ప్రత్యామ్నాయం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ విభాగ్ ప్రముఖ్ మర్రి శశిధర్‌రెడ్డి

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ పాలన అంతా అవినీతిమయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ విభాగ్ ప్రముఖ్ మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబమంతా అవినీతికి పాల్పడుతోందని, సీఎంను ఫామ్ హౌస్‌కి పరిమితం చేస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పులమయంగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా సబ్సిడీలను సైతం ఎత్తివేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమన్నారు. లిక్కర్ స్కాంలో ఎటువంటి రాజకీయం లేదన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని, తప్పు చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని వెల్లడించారు. మిషన్ భగీరథ నీరు ఎక్కడా అందించడం లేదని పాత వాటికే రంగులేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానా లు గెలిచే అవకాశాలు తమ పార్టీకే ఉన్నాయన్నారు. ఈ దిశగా నాయకులు సమష్టిగా కృషి చేసేలా దిశా నిర్దే శం చేస్తున్నామన్నారు. కేంద్రం చేస్తున్న ప్రజాభాగస్వామ్య అభివృద్ధి రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి దోహదం చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు అయ్యన్న గారి భూమయ్య, మయూర్ చంద్ర, సుహాసినిరెడ్డి, దినేష్ మటోలియా, రవి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

35 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్‌: మద్యం సేవించి వాహనాలు నడిపిన 35 మందికి జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్‌ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడ్డారు. వారిని నిర్మల్‌ కోర్టులో హాజరు పర్చగా 35 మందికి రూ.42వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన మంద కార్తీక్‌ గత నెల 30న ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్‌ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికి వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం టుటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విఠల్‌ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

ఖానాపూర్‌: మండలంలోని గోసంపల్లెలో మంగళవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై ఆర్‌.శంకర్‌ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలోని ఓ రేకుల షెడ్డులో దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.4వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో పోలీసు సిబ్బంది రవి, మధుకర్, రవినాయక్, సుధీర్‌ పాల్గొన్నారు.

నిర్మల్‌ టు రాజోలు సూపర్‌ లగ్జరీ బస్సు

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌ నుంచి ఏపీలోని భీమవరం, రాజోలుకు బుధవారం నుంచి ఆర్టీసీ ప్రతీరోజు సూపర్‌ లగ్జరీ బస్సు నడుపనున్నట్లు డిపో మేనేజర్‌ ఎస్‌.సాయన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌ నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు బయలుదేరి హైదరాబాద్, విజయవాడ, గుడివాడ, ముదునేపల్లి, భీమవరం, పాలకొల్లు మీదుగా వెళ్లి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు రాజోలుకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 7 గంటలకు రాజోలు నుంచి బయలుదేరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తెలంగాణ, ఏపీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



పర్సును అందజేస్తున్న శేషారావు

కుంటాల(ముధోల్‌): భైంసాకు చెందిన శివంద అనే మహిళ కుంటాల మండలంలోని కల్లూర్‌ గ్రామానికి పని నిమిత్తం వచ్చి పర్సు పోగొట్టుకుంది. మండలంలోని అంబుగామ గ్రామానికి చెందిన జాదవ్‌ శేషారావుకు పర్సు దొరికింది. అందులో రూ.10,050 నగదు ఆధార్, పాన్‌కార్డు ఉండడంతో పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించాడు. ఎస్సై హన్మండ్లు, ఏఎస్సై తారాచంద్‌ ఆధ్వర్యంలో మహిళకు పర్సును అప్పగించారు.

నిర్మల్‌ ఖిల్లా: ప్రస్తుత కాలంలో అందరిలో ఆరోగ్యంపై అవగాహన ఎక్కువైంది. శరీరానికి ఎటువంటి ఆహారం మంచిదో ఆలోచిస్తున్నారు. చిరుధాన్యాలు లేదా తృణధాన్యాలు, ఆహార ధాన్యాలలో చిన్నగింజలు కలిగిన గడ్డిజాతి పంటలు. సాధారణంగా మిల్లెట్స్‌ అని పిలువబడే ఈ జాతులలో అనేక రకాలున్నాయి. రాగులు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు గొప్పగా కనిపించకపోవచ్చు. కానీ ఆరోగ్యానికి ఇవిచేసే మేలు మాత్రం చాలా ఎక్కువ. నేడు ధాన్యాల్లో బాగా ప్రాచుర్యంలో ఉన్నవి జొన్నలు, రాగులు, కొన్ని ప్రాంతాల్లో సజ్జలు కూడా వాడుతున్నారు. కానీ కొర్రలు, అరికలు, వరిగెలు, సామలు.. ఇలా ఇంకా చాలానే ఉన్నాయి. వీటి గురించి చాలా మందికి పూర్తిగా తెలియదు. చిరుధాన్యాలుగా పిలుచుకునే మిల్లెట్స్‌తో మంచి ప్రయోజనం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ నేపథ్యంలో 'సాక్షి' కథనం..

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- మిల్లెట్స్‌తోనే ఫిట్‌నెస్‌
- సంప్రదాయ ఆహారంగా క్రేజ్‌
- రోజులో ఒక్కపూటైనా తినాలంటున్న ఆరోగ్య నిపుణులు
- ఆలయాల్లో నైవేద్యంగా అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



ప్రయోజనం ఏమిటి?

చిరు ధాన్యాల్లో పిండి పదార్థంతో పాటు ప్రొటీన్లు, పీచు పదార్థం, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. చిరు ధాన్యాల్లో పొట్టు తీసినా, కాస్త కొవ్వు ఉంటుంది. షుగర్‌ పేషంట్లకు ఒక విధంగా బలం లాంటివి. బియ్యంతో పోలిస్తే ఇవి నెమ్మదిగా జీర్ణం అవుతాయి. కాబట్టి తొందరగా ఆకలి వేయదు. బరువు తగ్గడానికి తోడ్పడుతాయి. రక్తంలో కొలెస్ట్రాల్‌ శాతం అదుపులో ఉంటుంది. చిరుధాన్యాల్లో క్యాల్షియం, ఐరన్, జింక్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్, విటమిన్‌–బి, కెరోటిన్, తదితర మూలకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో ఉండే ఎసిడిటీని అంటే యాసిడ్‌ను తొలగిస్తాయి. వీటిలో ఉండే విటమిన్‌–బి, 3 శరీరం యొక్క జీవక్రియ ప్రక్రియను సరిగ్గా ఉంచుతాయి. డయాబెటిస్‌ను నివారించగలవు. ఉబ్బసం వ్యాధి నివారణకు మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులన్నీ నయమవుతాయి. థైరాయిడ్, మూత్రపిండాలు, కాలేయం, తదితర వ్యాధుల నియంత్రణకు తోడ్పడుతాయి. కడుపులో ఇబ్బంది, అల్సర్‌ వంటివి తలెత్తకుండా ఉంటాయి. మలబద్ధకం కూడా దూరం అవుతుంది. ఇన్ని ప్రయోజనాలను అందిస్తున్న వీటిని ఆహారంలో ఒక భాగంగా చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఏయే మిల్లెట్స్‌ దేనికి పనిచేస్తాయి

సజ్జలు: అధిక బరువు, డయాబెటిస్‌ సమస్యలు ఉన్నవారు సజ్జలు ఆహారంగా తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. వీటి వల్ల జీర్ణ సమస్యలు నయమవుతాయి. రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు.

ఊదలు:
మలబద్ధకం, జీర్ణ సమస్యలు, డయాబెటిస్‌ ఉన్నవారు ఊదలను ఆహారంగా తీసుకుంటే సమస్యకు మంచి పరిష్కారం లభిస్తుంది.

సామలు:
మైగ్రేన్‌ సమస్య ఉన్నవారు సామలను వండుకుని తినాలి. ఇవి శరీరానికి మంచి పోషకాలను అందిస్తాయి. ఎముకలు, నరాలు దృఢంగా మారుతాయి. పేగు క్యాన్సర్‌ రాదు. బాలింతల్లో పాలు ఎక్కువగా తయారయ్యేలా చేస్తాయి.

ఉలవలు:
కిడ్నీలో రాళ్లు ఉన్నవారు ఉలవలు తినాలి. వీటివల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మూత్ర సంబంధ సమస్యలు తగ్గుతాయి.

అరికెలు:
డయాబెటిస్, కొలెస్ట్రాల్‌ సమస్యలు ఉన్నవారు అరికెలను తింటే శరీర రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. క్యాన్సర్‌ రాకుండా ఉంటుంది.

రాగులు:
ఈ గింజలతో జావ, రాగిముద్ద, రాగిరొట్టె చేసుకుని తినవచ్చు. రాగులు రాగులు చలువ చేస్తాయి. ఎండకాలంలో వీటిని తీసుకుంటే శరీరానికి చల్లదనం కలుగుతుంది. అలాగే రక్తం బాగా తయారవుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది.

కొర్రలు:



అధిక బరువుతో ఇబ్బంది పడేవారు కొర్రలను వండుకుని తినాలి. దీనివల్ల బరువు త్వరగా తగ్గవచ్చు. వీటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు ఉండవు. గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

ఓట్స్‌:
వీటిలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. మార్కెట్‌లో ఈ ఉత్పత్తులు విస్తృత పరిధిలో ఉన్నాయి. ఇవి అనేక రకాల రుచులతో నిల్వ పదార్థాలుగా వస్తున్నాయి.

చిరుధాన్యాల్లో రకాలు

- సజ్జలు
- కొర్రలు
- వరిగెలు
- రాగులు
- ఓట్స్‌
- అరికెలు
- అండు కొర్రలు
- ఊదలు
- ఉలవలు

ఆలయాల్లో నైవేద్యంగా మిల్లెట్స్‌

రాష్ట్ర దేవదాయ శాఖ ఆదివారం నిర్వహించిన నూతన సచివాలయ ప్రారంభ కార్యక్రమంలో ప్రధాన ఆలయాలలో మిల్లెట్స్‌తో కూడిన నైవేద్యం, భక్తులకు ప్రసాదాలను అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన చాంబర్‌లో సంతకం చేశారు.

చిరుధాన్యాల సంవత్సరంగా 2023

ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. మిల్లెట్స్‌లో ఉన్న పోషకాలు శరీరానికి సమతుల్యతను సమకూర్చడంలో క్రియాశీలకంగా ఉంటుందని యూఎన్‌వో తెలిపింది.

సహజసిద్ధ పంటలు



చిరుధాన్యాలు ప్రకృతి సిద్ధంగా లభించే గడ్డి జాతికి చెందినవి. ఇవి మనకు అనాదిగా సంప్రదాయబద్ధంగా వస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యపరంగా మిల్లెట్స్‌ ప్రాధాన్యత పెరిగింది. ఇవి ఎటువంటి క్రిమిసంహారక మందులు లేకుండా పండించే సహజ సిద్ధ పంటల జాతికి చెందినవి. వీటిలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. వీటిని వాడడం వల్ల శరీరానికి కావాల్సిన ప్రొటీన్స్‌ ఖనిజ లవణాలు, పీచు పదార్థం సమృద్ధిగా లభిస్తాయి.

– నల్ల మన్మోహన్‌రెడ్డి, సేంద్రియ రైతు, నిర్మల్‌

ఆరోగ్యానికి మంచి నేస్తాలు



చిరుధాన్యాలను ఆహారంలో విరివిగా ఉపయోగించడం వల్ల అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్‌ వంటివి రాకుండా కాపాడుతాయి. శారీరకంగా సమతుల్యతను కలుగజేస్తాయి. చిన్నపిల్లలకు కూడా రోజులో ఒకసారైనా వీటితో పలురకాల ఆహారపదార్థాలు చేసి తినిపిస్తే ఆరోగ్యపరంగా మంచిది.

– డాక్టర్‌ అల్లాడి రవి, ప్రకృతిసిద్ధ ఆయుర్వేద వైద్యులు, శ్రీచక్ర హాస్పిటల్, నిర్మల్‌

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమేందర్‌



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమేందర్‌

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధితో పాటు ఆదిలాబాద్‌ పట్టణంలో వరుస చోరీలకు పాల్పడుతున్న యువకుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి వెండి ఆభరణాలు, బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మావల పోలీస్‌ స్టేషన్‌ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఉమేందర్‌ వివరాలు వెల్లడించారు. మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని న్యూహౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన మహమ్మద్‌ మోయిజ్‌ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఏప్రిల్‌ 6న టీచర్స్‌ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో వెండి ఆభరణాలు, హుండీలో నగదు దొంగిలించాడు. 11న స్నేహితులు గజానంద్, అఫ్సర్‌లతో కలిసి దస్నాపూర్‌ వైన్స్‌షాపులో కౌంటర్‌లోని రూ.53 వేల నగదును, బీర్లు, మద్యం బాటిళ్లు, సీసీ కెమెరా డీవీఆర్‌ను ఎత్తుకెళ్లాడు. 13న ఆదిలాబాద్‌ వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓల్డ్‌ హౌజింగ్‌ బోర్డు కాలనీలో ఓ ఇంటితాళం పగులగొట్టి రూ.1,500 నగదు అపహరించాడు. 17న మోయిజ్, ఏజెలు కలిసి మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రాంనగర్‌ శివాలయంలో గేటు తాళం పగులగొట్టి హుండిలోని రూ.500 దొంగిలించాడు. న్యూ హౌజింగ్‌ బోర్డు కాలనీలోని జోన్‌ 2లో ఇంటి తలుపులు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించాడు. 23న ఆదిలాబాద్‌ వన్‌ టౌన్‌ పరిధిలోని పంజేషా కాలనీలో ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, రూ. 50వేల నగదు అపహరించాడు. 28న మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పిట్టల్‌వాడ కాలనీలో ఇంట్లో చొరబడి రెండు తులాల బంగారం, రూ. 50వేల నగదు దొంగిలించాడు. మంగళవారం దస్నాపూర్‌ పెట్రోల్‌ పంపు సమీపంలో తిరుగుతుండగా మావల పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి కిలో వెండి కిరీటం, 7 గ్రాముల బంగారం, 65 తులాల వెండిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నిందితుడిని పట్టుకున్న మావల ఎస్సై విష్ణు వర్ధన్, కానిస్టేబుల్‌ ఎంఏ కరీం, శివాజీ, అనిల్, తిరుపతిరెడ్డిలను అభినందించి నగదు పురస్కారం అందజేశారు.

వీడిన జంటహత్యల మిస్టరీ

- ఇద్దరు చెల్లెళ్లు, బావతో కలిసి భార్య, మరోవ్యక్తి హత్య
- పరువు పోతుందనే అఘాయిత్యం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: గుడిహత్నూర్‌ మండలం సీతాగొంది సమీపంలోని గర్కంపేట శివారు పంట పొలాల్లో గతనెల 30న జరిగిన జంట హత్యల కేసు మిస్టరీ వీడింది. దీనిపై గుడిహత్నూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఎస్పీ ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో మిస్టరీని ఛేదించారు. మంగళవారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అశ్వినికి సుందరయ్యనగర్‌కు చెందిన సోన్‌కాంబ్లే రమేశ్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఎనిమిదేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. మూడు నెలల క్రితం నుంచి భుక్తాపూర్‌ కాలనీకి చెందిన రహిమాన్‌తో అశ్విని సన్నిహితంగా ఉంటోంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి కేఆర్‌కే కాలనీలో పుట్టింట్లోనే ఉంటుంది. గతనెల 28న ఉదయం రమేశ్‌ కేఆర్‌కే కాలనీకి వెళ్లాడు. అశ్విని లేకపోవడంతో అనుమానం వచ్చిన రమేశ్‌ వారం రోజుల క్రితం 'మీ మమ్మీ ఎక్కడికి వెళ్లిందో నీకు గుర్తుందా' అని కుమారుడిని అడగడంతో సీతాగొంది వైపు వెళ్లిందని చెప్పాడు. కుమారుడితో కలిసి సీతాగొందిలోని గర్కంపేట వైపు వెళ్లి చూడగా రోడ్డు పక్కన ఓ వాహనం నిలిపి ఉంది. ఇదే స్కూటీపై గతంలో వచ్చామని కుమారుడు చెప్పాడు. కొంతదూరం వెళ్లగా పొదల్లో తన భార్య వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉండటాన్ని చూశాడు. ఆ తర్వాత రమేశ్‌ తన ఇద్దరు చెల్లెళ్లు స్వప్న, శీల, బావ వెంకటేశ్‌లకు ఫోన్‌ చేసి విషయం చెప్పడంతో ఆటోలో అక్కడికి చేరుకున్నారు. అక్కడే ఉన్న కర్ర తీసుకున్న రమేశ్‌ వెనుకవైపుగా వెళ్లి రహిమాన్‌ తలపై బాదడంతో అక్కడే మృతి చెందాడు. అశ్విని పారిపోతుండగా అతని చెల్లెళ్లు, బావ పట్టుకుని తలపై, వెనుక భాగంలో కర్రతో కొట్టడంతో మృతి చెందింది. రమేశ్‌ను పోలీసులు అరెస్టు చేయగా స్వప్న, వెంకటేశ్, శీల పరారీలో ఉన్నట్లు ఎస్పీ వివరించారు. సమావేశంలో ఉట్నూర్‌ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ నైలు, సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రమౌళి, గుడిహత్నూర్‌ ఎస్సై ప్రవీణ్‌ కుమార్, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్, సిరికొండ ఎస్సై నీరేష్, నేరడిగొండ ఎస్సై సాయన్న ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- కొత్త కోర్సులకు ముందుకొస్తే అనుమతి
- కేయూ వీసీ ఆచార్య రమేశ్‌



మాట్లాడుతున్న వీసీ డాక్టర్‌ రమేశ్‌

కేయూ క్యాంపస్‌ : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యం కావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను కోరారు. మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–2024 విద్యాసంవత్సరంలో ఉపాధి కల్పనకు కొత్త కోర్సులను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే కళాశాలలకు అనుమతులు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు పది చొప్పున 30 కళాశాలలకు అవకాశం ఇస్తామని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా అన్ని కళాశాలలు న్యాక్‌ గుర్తింపునకు ప్రతిపాదించుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలల్లో రీసెర్చ్‌ సెంటర్లుగా గుర్తించామని, ఇప్పటికే పలువురు అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్‌ ఇచ్చామన్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో కూడా వాల్యూయేషన్‌ ప్రక్రియ చేపట్టనున్నామన్నారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కేయూ సీడీసీ డీన్‌ ఆచార్య వి.రాంచంద్రం మాట్లాడుతూ కళాశాలల్లో నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకులు రిజిస్టర్, అడ్మిషన్ల రిజిస్టర్, ఉండాలన్నారు. కేయూ అకాడమిక్‌ డీన్‌ ఆచార్య జి.షమిత మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో 290 కళాశాలల్లో వివిధ డిగ్రీ కోర్సుల్లో 14 కంటే తక్కువగా కూడా విద్యార్థులు ఉన్నారన్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఆచార్య ముస్తాఫా, డాక్టర్‌ జె.మధుకర్, ఎస్‌.జ్యోతి, సీహెచ్‌ రాధిక, ఎ.నరేందర్, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌లు డాక్టర్‌ కోలా శంకర్, రామా వెంకటేశ్వర్లు, హబీబ్, ఆర్‌.శ్రీలతాదేవి, డాక్టర్‌ వల్లాల పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- గిరిజన సంక్షేమ శాఖ ఏడీ సర్వేశ్వర్‌ రెడ్డి




మాట్లాడుతున్న ఏడీ సర్వేశ్వర్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్‌: వేసవి సెలవుల్లో జిల్లాలోని గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్‌ డైరెక్టర్‌ సర్వేశ్వర్‌ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్‌ సమ్మిట్‌ క్యాంప్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అందజేస్తున్న ఇలాంటి శిక్షణలు భవిష్యత్‌లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ డాక్టర్‌ దిలీప్‌ కుమార్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, ఏసీఎంవో జగన్, ఆదిలాబాద్, బోథ్‌ ఏటీడీఓలు నిహారిక, సౌజన్య, పాఠశాల ప్రిన్సిపాల్‌ లక్ష్మీనారాయణ, ఏటీడబ్ల్యూవో జూనియర్‌ అసిస్టెంట్‌ సంజీవ్‌ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వలస కూలీ మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): మండలంలోని రాంపూర్‌ సబ్‌స్టేషన్‌ సమీపంలో నిర్మల్‌ జిల్లా భైంసాకు చెందిన వలస కూలీ వాగ్మారే సాహేబ్‌రావు (23)ఉరేసుకుని మృతి చెందినట్లు ఎస్సై భూమేష్‌ తెలిపారు. భైంసాకు చెందిన షేక్‌ అక్బర్‌ కాగజ్‌నగర్‌ ఎక్స్‌రోడ్‌ సమీపంలోని జిన్నింగ్‌ మిల్లులో పనిచేస్తున్నాడు. మిల్లులో పనిఉందని చెప్పి భైంసాకు చెందిన సాహేబ్‌రావును గత నెల 23న తీసుకువచ్చాడు. 29న షేక్‌ అక్బర్‌ సాహేబ్‌రావు తమ్ముడు దిలీప్‌కు ఫోన్‌చేసి మీ అన్న మద్యం సేవించి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని, ఇంటికి తీసుకెళ్లమని చెప్పాడు. అదేరోజు సాయంత్రం ఫోన్‌చేసి ఎటో వెళ్లిపోయాడని చెప్పాడు. మరుసటి రోజు దిలీప్‌ జిన్నింగ్‌ మిల్లుకు వచ్చి కూలీలతో కలిసి గాలించారు. సోమవారం రాత్రి రాంపూర్‌ సబ్‌స్టేషన్‌ వెనుక భాగంలో చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం సాహేబ్‌రావుదేనని గుర్తించారు. మృతుని సోదరుడి ఫిర్యా దు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరీక్షకు ఒకే ఒక్కడు!



జిల్లా కేంద్రంలోని గెజిటెడ్‌ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన హౌస్‌ వైరింగ్‌ పరీక్షకు ఒకే ఒక్క విద్యార్థి హాజరయ్యాడు. ఇందు కోసం తొమ్మిది మంది ఉద్యోగులు విధులు నిర్వహించడం గమనార్హం. ఇన్విజిలేటర్‌ ఒకరు లోపల ఉండగా మరో ఎనిమిది మంది బయట విధులు నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్‌

గిరిజన గ్రామాలపై దృష్టి సారించాలి

నార్నూర్‌: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలపై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొట్నాక్‌ విజయ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం మండలంలోని సుంగాపూర్‌ను సందర్శించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుంగాపూర్‌ గొండుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు దాదాపు మూడు కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి నీటిని తెచ్చుకోవడం బాధాకరమన్నారు. ఐటీడీఏ ఉన్నా గిరిజనుల సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బావి నుంచి ప్రత్యేక పైపులైన్‌ వేసి తాగునీరు అందించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్కా బాపురావు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్‌ పుష్పారాణి, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్‌ దాదిరావు, నాయకులు తుంరం సంతోష్, పుందూర్‌ మధు, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు–మనబడి పనులు పూర్తి చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న రావుల శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్‌

నిర్మల్‌రూరల్‌: జిల్లాలో చేపట్టిన మన ఊరు–మన బడి పనులను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌ రావుల శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌ లో కలెక్టర్‌ వరుణ్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 260 పాఠశాలలు ఎంపిక చేయగా 126 పాఠశాలల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పాఠశాలల్లో ఈ నెల 31లోగా అన్నిపనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో మన ఊరు–మన బడి పనుల ప్రగతిపై ప్రతీవారం సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలు ప్రారంభించామని, మిగతావి కూడా సిద్ధంగా ఉంచుతామన్నారు. సమావేశంలో డీఈవో రవీందర్‌ రెడ్డి, ఆర్డీవో విజయ లక్ష్మి, ఇంజినీరింగ్‌ అధికారులు శంకరయ్య, అశోక్, ఏఈలు, సెక్టోరల్‌ అధికారులు సామల రాజేశ్వర్, నాగుల రవి, ఎంఈవోలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సోన్‌: మన ఊరు–మనబడి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్‌ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్మల్‌బొప్పారం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ శంకరయ్య, ఎంఈవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌(జి): నిర్మల్‌ అటవీశాఖ గెస్ట్‌హౌస్‌లో నర్సాపూర్‌(జి) మండల ఆర్బీఎస్‌ అధ్యక్షుడు గోపిడి గంగారెడ్డి శాలువాతో సత్కరించారు.

క్లుప్తంగా

సుకుమార్ పెట్కులేకు సత్కారం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్రంలో జ్యోతిరావుపూలే దంపతుల ఆశయ సాధన కోసం పాటుపడుతున్న మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులేను మంగళవారం నాగపూర్‌లో జరిగిన కార్యక్రమంలో సత్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసరే మాలీ సంఘటన్ నాగపూర్ వారి తరఫున కృష్ణ మహాడోళే పూలే దంపతుల చిత్రపటాన్ని బహూకరించడం జరిగిందన్నారు. తమతో పాటు రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ఉత్తంరావ్ ఉన్నారని తెలిపారు.

ఆలయ నిర్మాణం అభినందనీయం

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో వెల్మ లింగారెడ్డి రూ.50లక్షల సొంత నిధులతో తన సొంత స్థలంలో అడెల్లి పోచమ్మ ఆలయం నిర్మించడం అభినందనీయమని మాజీ పాడి పరిశ్రమ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు లింగారెడ్డి దంపతులను సన్మానించారు. దేవారెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, జైభారత్ రెడ్డి పాల్గొన్నారు.

'సేవలో ముందుంటాం'

నేరడిగొండ: సేవ కార్యక్రమాల్లో ముందుంటామని, అందరు సహకరించాలని అప్పీల్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సెరికల్చర్ లైసన్ అధికారిణి రాథోడ్ పార్వతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి పసుల చంటి, అప్పీల్ సంస్థ అధ్యక్షుడు గోళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు బానోత్ కర్ణ, నేరడిగొండ మండల నాయకులు రవీందర్ రాథోడ్, జాదవ్ శ్రీకాంత్, జాదవ్ శశికాంత్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేయాలి

ఎదులాపురం: మతం మారిన గిరిజనులకు రిజర్వేషన్లు రద్దు చేయాలని, రిజర్వేషన్లు వర్తించకుండా చట్టం తీసుకురావాలని జనజాతి సురక్ష మంచ్ జిల్లా కన్వీనర్ మేస్రం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతం మారిన గిరిజనులతో నిజమైన వారికి అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై జిల్లా కేంద్రంలో ఈ నెల 29న భారీ బహిరంగ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొడప వినాయక్‌రావు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్

ఆదిలాబాద్‌టౌన్: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగ్‌రాం అంతర్వేది అన్నారు. మంగళవారం కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ జాకిర్ హుస్సేన్, రఘునాథ్, ఆర్.సంతోష్ కుమార్, నర్సింగ్‌రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు గర్భిణులు, బాలింతల విషయంలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోజువారి ఓపీ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశమయ్యారు. గర్భిణి,బాలింత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యుడు శ్రీకాంత్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పొలిటికల్ పార్టీ సమావేశం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో కదం సురేశ్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి పొలిటికల్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులకు 2022-23లో తొలగింపు జాబితా, చేర్పుల జాబితాపై చర్చించారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

బేల: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం దివ్యాంగుల కోసం బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్‌కుమార్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పాస్ ఫొటోలతో పాటు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌లతో ఈ బస్‌పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

ఉట్నూర్‌రూరల్: వాహనదారులు పెండింగ్‌లోని చలాన్లు వెంటనే చెల్లించాలని ఆర్డీవో సాచరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాలు లేని రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఫైన్లు ఉన్న వాహనాల చలాన్లు చెల్లించాలన్నారు. పది రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

విద్యుత్ కనెక్షన్ భారమే..


చేనులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, బోరు

- పెరిగిన విద్యుత్ పరికరాలతో ఆర్థిక భారం
- రాయితీ పెంచాలంటున్న రైతులు

బోథ్: విద్యుత్ సామగ్రి ధరలను ప్రభుత్వం ఇటీవల పెంచింది. ×కొత్తగా విద్యుత్ కనెక్షన్ తీసుకొనే వారికి ఈ ధరలు 30 శాతానికి పైగా పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చే రాయితీ పోగా ఎక్కువ మొత్తంలో చేతి నుంచి డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కర్షకులకు మూలిగే నక్కపై తాటిపండు చందంగా మారింది. గృహ, వ్యాపార అవసరాలకు సైతం కొత్తగా సరఫరా తీసుకొనే వారికి కూడా ఇది మోయలేని భారంగా మారింది.

రాయితీ ఇలా..

వ్యవసాయ విద్యుత్ సర్వీసుల జారీకి ప్రభుత్వం రెండు రకాల రాయితీలు ఇస్తోంది. రైతు కొత్తగా కనెక్షన్ పొందాలంటే ముందుగా రూ.5,290లను మీ సేవ కేంద్రంలో చెల్లించాలి. అప్పటికే విద్యుత్ నియంత్రిక ఉండి, మూడు స్తంభాలే అవసరం ఉంటే రూ.45 వేలు, నియంత్రిక కూడా కొత్తగా బిగించాల్సి ఉంటే రూ.70 వేల రాయితీ విడుదల చేస్తోంది. ఇంత కన్నా ఎక్కువ మొత్తంలో స్తంభాలు కావాలన్నా.. తీగలు, ఇతర సామగ్రి అవసరమైనా.. రైతు ఆ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. దీనిని ఔట్‌రైట్ కంట్రిబ్యూషన్(ఓఆర్సీ) ఛార్జీలుగా పిలుస్తుంటారు.

దూరంగా ఉంటే మరింత ఖర్చు

గృహ, వాణిజ్య వినియోగదారులపైనా ఈ ధరల పిడుగు పడింది. కొత్త కాలనీల్లో, నివాస ప్రాంతాలకు దూరంగా ఇళ్లు నిర్మించుకొనే వారికి విద్యుత్ లైన్లు అందుబాటులో ఉండవు. పంచాయతీలు, పురపాలక సంఘాలు నిధులు చెల్లించి కొత్తవి నిర్మించే వరకు ఆగాలంటే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి వారు సంస్థ అంచనా ప్రకారం సర్వీసు లైన్ ఛార్జెస్(ఎస్‌ఎల్‌సీ) చెల్లిస్తే కొత్త లైన్‌లు వేస్తారు. ఒక నియంత్రిక, నాలుగు స్తంభాల లైన్ వేయాలంటే కనీసం రూ.2లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

పరికరాల ధరల పెరుగుదల వివరాలు..

వస్తువు	పాత ధర(రూ.)	కొత్త ధర(రూ)
25 కేవీఏ నియంత్రిక	70,193	99,337
63 కేవీఏ నియంత్రిక	1,45,000	2,03,874
100 కేవీఏ నియంత్రిక	1,88,000	2,48,255
ఏబీ స్విచ్	8,151	13,564
ఎర్త్ పైపు	2939	3201
విద్యుత్ తీగ మీటరు		2438

పెరుగుదల ఇలా..

విద్యుత్ సామగ్రి ధర పెరగడం, దానికి జీఎస్టీతో పాటు సంస్థ చార్జీలు కలవడంతో 36 శాతం వరకు ధరలు పెరుగుతున్నాయి. కొత్తగా కనెక్షన్ కావాలనుకొనే ప్రతి రైతు, అందుబాటులో లేక దూరం నుంచి లైన్ తీసుకొనే వినియోగదారుడు భారం భరించాల్సి ఉంటుంది.

పార్టీకి బలగం కార్యకర్తలే

- ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, ఎమ్మెల్యే రేఖానాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: పార్టీకి బలగం కార్యకర్తలేనని ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒంటరిగా మొదలైన టీఆర్ఎస్ పార్టీ నేడు 60 లక్షల కార్యకర్తలతో బీఆర్ఎస్ అవతరించి దేశ రాజకీయాల్లో దూసుకెళ్తుందన్నారు. ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాల ఇంటి గడప వద్దకు నేరుగా ప్రభుత్వం అందిస్తుందని కొనియాడారు. రాష్ట్ర రాజధానిలో డాక్టర్ బీఆర్ఎస్ అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ రాష్ట్ర సచివాలయం, అమర వీరుల స్థూపం ఇలా అద్భుతమైన కట్టడాలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్ ఆరవు, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ ఎస్సీ రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సతీశ్, నాయకులు అజీమొద్దీన్, పోషన్న, స్వామి పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికీ రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కై లాసనగర్: భారతదేశంలోని పౌరులందరికీ భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని, ఆ గ్రంథంపై ప్రజలకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. స్థానిక ఆర్‌అండ్‌ బి గెస్ట్ హౌస్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని నడిపిస్తున్న భారత రాజ్యాంగ గ్రంథంపై 90శాతం మంది ప్రజలకు అవగాహన లేదన్నారు. ఫలితంగా బడుగు, బలహీన వర్గాలు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను పొందలేకపోతున్నారన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ విఫలం కావడానికి ఇదే కారణమన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, నాయకులు చిట్యాల శ్రీనివాస్, వెంకటేష్, రామ్ చందర్, కరాటి గంగన్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హర్కపూర్‌లో సామూహిక వివాహాలు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్ అంద్‌గూడలోని శ్రీశ్రీ సంత్ పూలాజీబాబా ధ్యాన్ మందిర్ ఉత్సవ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక వివాహాల్లో ఐదు జంటలు ఒక్కటయ్యాయి. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి హాజరై వారిని ఆశీర్వదించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం భవనానికి నిధులు


ప్రొసిడింగ్ కాపీని అందిస్తున్న ఎంపీ బాపురావు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఎంపీ నిధుల నుంచి రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి రూ.6లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆ సంఘం సభ్యులకు ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రెడ్డి సంఘ భవనం అభివృద్ధికి ఎల్లవేళలా తనవంతుగా సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్ల నారాయణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపిడి రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులు కంది లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతన పెంపుపై పారిశుధ్య కార్మికుల హర్షం


చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

కైలాస్‌నగర్: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం కేసీఆర్ పారిశుధ్య కార్మికులకు రూ.1000 వేతనం పెంచడంపై మున్సిపల్ పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తూ మంగళవారం స్థానిక ఫిల్టర్ బెడ్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు పారిశుధ్య కార్మికులకు కేవలం రూ.6500 వేతనం ఉండేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానిని రూ.8300కు పెంచిందన్నారు. 2016లో 12వేలు, 2022 రూ.15600 వేతనాన్ని అందించిందన్నారు. తాజాగా మరో వేయి రూపాయల వేతనం పెంచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి సతీష్, నాయకులు సృజన్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

బేల: ప్రతీ గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీల సంఖ్య 150, ఆ పైబడి పెంచాలని ఎంపీడీవో మహేందర్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాప్సి(బి) గ్రామ శివారులో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న మినీ ఇరిగేషన్ ట్యాంకు పనులను పరిశీలించారు. నర్సరీ నిర్వహణపై ఆరా తీశారు. గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు వారీగా ఉపాధి పనులకు వస్తున్న కూలీల సంఖ్యను పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కూలీలు చేసిన పనులకు వేను వేంటనే కూలీ డబ్బులు చెల్లింపులు అయ్యేలా మాస్టర్స్ రాయడం ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ, సిబ్బంది ఉన్నారు.

సూచనలు పాటించాలి

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్, కీటక శాస్త్ర నిపుణులు రాజశేఖర్‌లు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల చేనులను పరిశీలించారు. వర్షాకాలంలో సాగుకు సంబంధించి విత్తనాల కొనుగోలు, దుక్కి దున్నడంపై పలు సూచనలు చేశారు. విత్తనాలను లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే కొనుగోళ్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, ఏఈఓ శ్యామ్ సుందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిధుల మంజూరు

బోథ్: మండల కేంద్రంలోని అయ్యప్ప సేవా సమితి కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.4 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసిడింగ్‌ను ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం సభ్యులకు అందజేశారు. ఎంపీపీకి సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. మండలంలోని సొనాల గ్రామంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి రూ.5లక్షల ప్రొసిడింగ్‌లను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్పీకి పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన జగిత్యాల డీఎస్పీ ప్రకాష్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా ఐపీఎస్ అధికారిణి సింధూశర్మ, మహబూబాబాద్ డీఎస్పీ రూపేష్‌లు మంగళవారం పరామర్శించారు.

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు సుమన్ బాయి తండ్రి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న పాడి పారిశ్రామిక మాజీ చైర్మన్‌లోక భూమారెడ్డి మంగళవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, మెస్రం భీంరావు, రవి చందర్ ఉన్నారు.

విశ్వకర్మల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

బోథ్: విశ్వకర్మల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. ఇటీవల విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మేడిచెల్మ ప్రవీణ్‌ను మంగళవారం బోథ్ మార్కెట్ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎల్క రాజు, వైస్ ఎంపీపీ లింబాజీ ఉన్నారు.

వేసవి శిబిరం ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: స్థానిక సరస్వతీ జ్ఞాన విద్యాలయం పాఠశాలలో కోకిల డాన్స్ అకాడమి ఆదిలాబాద్ ఆధ్వర్యంలో వేసవి శిబిరాన్ని ఎస్సై భరత్ సుమన్ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజమౌళి, రవి, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బోథ్: మండలంలోని చింతల్‌బోరి గ్రామానికి చెందిన ముండే మారుతి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంపీపీ తుల శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బహిర్గతం చేయాలి


మాట్లాడుతున్న భూపెల్లి శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: దళితబంధులో 30శాతం కమీషన్ తీసుకొని అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకంలో పలువురు ఎమ్మెల్యేలు లబ్ధిదారుడికి వచ్చే రూ.10లక్షల నుంచి రూ.3లక్షలు కమీషన్ వసూలు చేస్తున్నారని సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా దళితబస్తీ, డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీలో కూడా ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాల్లో కమీషన్లు తీసుకుంటున్నారని, కమీషన్లు తీసుకునే ఎమ్మెల్యేలను ఇంటికి పంపించే రోజులు దగ్గరికి వచ్చాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ రావు, మోతిరాం, నాందేవ్, రసూల్ ఖాన్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కజొన్న రైతుల విన్నపంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఏడాది ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా కొనుగోళ్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, మార్కెట్ కార్యదర్శి రమేశ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు మోహరాజ్ అహ్మద్, సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

బోథ్: రైతులు పండించిన ప్రతి గింజా కొంటామని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. రైతులు నాణ్యమైన పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి రూ.1962 మద్దతు ధరను పొందాలన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన జగిత్యాల డీఎస్పీ ప్రకాష్ మాతృమూర్తి మృతిచెందడటంతో అతడిని పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచ్ సురేందర్ యాదవ్, వైస్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, ఆత్మ చైర్మన్ సుభాష్, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్క రాజు, ఉమేష్ పాల్గొన్నారు.

'అక్రమ కేసులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే'


మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: అమాయకులపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అక్రమ కేసులు పెట్టిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో ఎటువంటి నేరం చేయని మరాఠా యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసేలా పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. సోమవారం రాత్రి వారిని అరెస్టు చేసి జైలుకు సైతం తరలించారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జోగురవి, దినేష్ మటోలియా, సుభాష్, ముకుంద్, నగేష్ రెడ్డి, చిలుకూరి జ్యోతి రెడ్డి, సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బేల: కోగ్దూర్ గ్రామ సామాన్య ప్రజలపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ పహారాలోని మండలంలోని కోగ్దూర్ గ్రామంలోకి వెళ్లడానికి ప్రయత్నించిన ఆయనను పోలీసులు అడ్డుకున్నారు.

దివ్యాంగులను అవమానిస్తే జైలు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌అర్బన్: దివ్యాంగులను కించపర్చడంతో పాటు అవమానించే వారికి జైలు శిక్ష తప్పదని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. జిల్లా వికలాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ వాల్‌పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. దివ్యాంగుల మర్యాదలకు భంగం కలిగించినా, పెత్తనం చేసినా… మోసం చేసిన వారికి ఆరు నెలల నుంచి 10ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీం, పట్టణ అధ్యక్షుడు చందావర్ రాకేష్, గౌరవ అధ్యక్షుడు ఆకుల సునీల్ కుమార్, దివ్యాంగుల ఎంప్లాయి యూనియన్ అధ్యక్షుడు ఆడప నారాయణ, వికలాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంకననేని సుకుమార్, ఉపాధ్యక్షుడు అమానుల్లా ఖాన్, బంక రాజశేఖర్, బండి నందు, మేకల రమేష్, మహేందర్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి


సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: బహుజన రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉందని బీఎస్పీ మండల నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా బహిరంగ సభ వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఏకమై బహుజన రాజ్యాధికారం కోసం ముందుకు సాగాలన్నారు. ఈ నెల 7న తెలంగాణ భరోసా సభకు విచ్చేస్తున్న బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి సభను బహుజనులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. బీఎస్పీ నాయకులు ఆరిఫ్‌బేగ్, లక్ష్మీకాంత్, సృజన్, సాయికుమార్, నివర్తి, కరణ్ ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ భరోసా సభ గోడప్రతులను మంగళవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, ఖానాపూర్ ఇన్‌చార్జి బన్సిలాల్ రాథోడ్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఆరీఫ్ మిర్జా, జిల్లా నాయకులు సోన్‌కాంబ్లే సునీల్ ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న లెక్చరర్లు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలు తీర్చాలని తెలంగాణ రాష్ట్ర గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సోగల ప్రవీణ్‌కుమార్ అన్నారు. గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం స్థానికంగా ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతీ సంవత్సరం త్రిసభ్య కమిటీ ద్వారా ఎంపిక చేశారని, సమస్యల పరిష్కారానికి గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధిస్తున్న ప్రతీ సంవత్సరం గెస్ట్ లెక్చరర్లను ఆటో రెన్యూవల్ చేసి 12 నెలల పాటు కన్సాల్ డేటెడ్ వేతనం అందించి ప్రతీ నెల వేతనం చెల్లించాలన్నారు. గెస్ట్ లెక్చరర్లు జావిద్‌ఆలీ, దేవన్న, సుధాకర్, నసీర్, కార్తిక్, శ్వేతా, స్వప్న, జోహరా ఫాతిమా, రాజు ఉన్నారు.